# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  26-09-2025                  సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో లాజిస్టిక్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.

- ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రజలను భాగస్వాములుగా చేస్తామని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- నాలా చట్టం రద్దు తీర్మానాన్ని శాసనసభ ఈ రోజు ఏకగ్రీవంగా ఆమోదించింది.

- ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం రానున్న 24 గంటలలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం పేర్కొంది.

===================

రాష్ట్రంలో లాజిస్టిక్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శాసనసభలో లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోర్టులను అనుసంధానించేలా రహదారులను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 14,966 కిలోమీటర్ల రహదారులను 4500 కోట్ల రూపాయలతో త్వరలోనే చేపడతామని తెలిపారు. 1.5 లక్షల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్రంలో జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతీ 1000 చదరపు కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయని వివరించారు. అదే విధంగా రాష్ట్రంలో చేపడుతున్న హైస్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులతో ప్రగతి శరవేగంగా సాగుతుందని తెలిపారు. రాష్ట్రానికి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను కేటాయించేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్...34 సెకన్లు)

===================

ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రజలను భాగస్వాములుగా చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. డయేరియా కేసులు పెరిగిన నేపథ్యంలో గుంటూరుకు తాగునీటిని సరఫరా చేసే రిజర్వాయర్లను ఈరోజు ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజారోగ్యంపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్లకు 15 కోట్ల రూపాయలతో మరమ్మతు పనులు చేయిస్తామని తెలిపారు. రిజర్వాయర్ల నిర్వహణ, మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో  పర్యవేక్షణ చేయిస్తామని చెప్పారు.

===================

నాలా చట్టాన్ని రద్దు చేస్తూ శాసనసభ ఈరోజు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకే నాలా చట్టం రద్దు చేయడం జరిగిందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ సందర్భంగా సభకు వివరించారు. ఈ అంశం మీద ఆయన మాట్లాడుతూ.. నాలా చట్టం కారణంగా ఎవరైనా వ్యవసాయేతర

భూమికి అనుమతి తెచ్చుకోవడం సమస్యగా మారిందని అన్నారు. ఈ చట్టం వలన భూ యజమానులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. నాలా చట్టం వల్ల రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

==================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా దేశ నిర్మాణానికి కారకులైన పోరాట యోధులు, వారసత్వ సంరక్షకులను గౌరవిస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 140 సెకన్లు)

==================

కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన వస్తు సేవల పన్ను జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిఎస్టి 2.0 ప్రయోజనాలపై నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్లను కోరారు.

==================

రాష్ట్రంలో పేద మహిళల కోసం ప్రవేశపెట్టిన దీపం పథకం సక్రమంగా అమలవుతోందని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శాసనమండలిలో ఈరోజు సూపర్-6 పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

==================

ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ దిశగా కదిలి, రానున్న 24 గంటలలో దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్యన వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం అధికారి బి.శేఖర్ పేర్కొన్నారు. రేపు ఉదయం తీరము దాటే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాగల ఇరవై నాలుగు గంటలలో రాష్ట్రంలో ఒకటి, రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరిస్తూ...

(వాయిస్ బైట్...27 సెకన్లు)

==================

ఆసియా కప్ 2025 లో భాగంగా ఈ రాత్రి ఎనిమిది గంటలకు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా భారత్ శ్రీలంక జట్ల మధ్య టి-20 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా.. భారత్, పాకిస్తాన్ ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధించాయి.

==================
==================